క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆర్.జంబులదిన్నె అభయాంజనేయస్వామి ఆలయంలో హారతిస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, అభయాంజనేయ స్వామి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణ స్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కర శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



బదిలీ ఉద్యోగులను సత్కరించిన క్షేత్ర సహాయకులు

రుద్రవరం: మండలంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ఉద్యోగులు ఏపీఓ ప్రతాప్, ఈసీ సుబ్బన్న, కంప్యూటర్ ఆపరేటర్ జయప్రద, టెక్నికల్ అసిస్టెంట్లు సురేష్, నాగేంద్ర, హరిబాబు ఇటీవల వివిధ మండలాలకు బదిలీ అయ్యారు. వారిని మండల క్షేత్ర సహాయకులు అందరు కలిసి వారిని శనివారం స్థానిక ఉపాధి కార్యాలయం వద్ద సత్కరించారు.

జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపిక



వీరయ్య

నంద్యాల(న్యూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిభ అవార్డుకు నంద్యాలలోని గురురాజ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వీరయ్య ఎంపికైనట్లు విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి, బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అధినేత దస్తగిరిరెడ్డి శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ దక్షిణ ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాహిత్యం, విద్య, సామాజిక సేవా రంగాల్లో కృషి చేసిన ప్రముఖులను అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 13వ తేదీన గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అవార్డును ఆయన అందుకుంటారని చెప్పారు.

కొనసాగుతున్న వసంత నవరాత్రులు



హారతి అందుకుంటున్న సీతారామలక్ష్మణులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో వసంత నవరాత్రి ఉత్సవాలు ఏడవ రోజు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం స్థానిక సంజీవనగర్ రామాలయం, బైటిపేట కోదండ రామాలయం, కోటావీధిలోని ఏకశిల సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో సాయంత్రం సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊంజల్ సేవ జరిపించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. భగవత్ సేవా సమాజ్ సభ్యులు సూరయ్య, శ్రీనివాసులు, మధు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ల పరిశీలన

మహానంది: రాష్ట్ర వ్యాప్తంగా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్లు పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర పరిశీలకులు హైమేశ్వర రావు తెలిపారు. తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌ను శనివారం పరిశీలించారు. స్టాక్ పాయింట్ పరిశీలించిన అనంతరం ఎంఈఓ రామసుబ్బయ్య, జిల్లా ఏఎస్‌ఓ దస్తగిరి రెడ్డి తదితరులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

శ్రీశైలం: రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు టూ టౌన్ సీఐ చంద్రబాబు శనివారం తెలిపారు. స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఉపాధి పనులు కల్పిస్తాం

వెలుగోడు: జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీఓ నాగజ్యోతి తెలిపారు. ఇటీవల తనతో పాటు బదిలీపై వచ్చిన ఈసీలు రాంగోపాల్, రామేశ్వర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు మనోహర్, కిరణ్ కుమార్, బీఎస్‌పీ రామోజీ నాయక్, కంప్యూటర్ ఆపరేటర్లుగా పార్వతి, రంగయ్య శనివారం విధుల్లో చేరినట్లు ఆమె తెలిపారు. విధులు సక్రమంగా నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు.

దొర్నిపాడు స్టేషన్‌కు ఎస్‌ఐ కావలెను!

- ఏడాదిలో ముగ్గురు సబ్‌ఇన్‌స్పెక్టర్ల బదిలీ
- నెల రోజులుగా ఎస్‌ఐ లేని పోలీస్ స్టేషన్



దొర్నిపాడు పోలీస్ స్టేషన్

దొర్నిపాడు: నాలుగు వారాల నుంచి దొర్నిపాడు పోలీస్ స్టేషన్‌కు సబ్‌ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశాలు ఉన్నాయి. మండలంలో విచ్చలవిడిగా బెల్టుషాపులు ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది. సంవత్సర కాలంలోనే స్టేషన్‌లో ముగ్గురు ఎస్‌ఐలు బదిలీ అయ్యారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక బదిలీల పర్వం ప్రారంభం

ఎన్నికల సమయంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తిరుపాలు బదిలీపై వెళ్లడంతో 2024 ఫిబ్రవరి 28న ఎస్‌ఐగా సురేష్ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగేలా తన బాధ్యతలు నిర్వర్తించారు. అయినా ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అయన్ను బదిలీ చేశారు. 2024 ఆగస్టు 21న ఎస్‌ఐగా వెంకటేష్ విధుల్లో చేరారు. ఈయన కొన్ని రోజుల అనంతరం సెలవుల్లో వెళ్లడంతో రెండు నెలలకు మరో ఎస్‌ఐ హనుమంతు రెడ్డిని ఇక్కడికి బదిలీ చేయడంతో 2025 ఫిబ్రవరి 13న బాధ్యలు స్వీకరించారు. ఈయన కేవలం 25 రోజుల మాత్రమే విధులు నిర్వహించారు. మార్చి 9న రాత్రికి రాత్రే బదిలీ ఉత్తర్వులు రావడంతో రిలీవ్ అయ్యి వెళ్లిపోయారు. అప్పటి నుంచి దొర్నిపాడుకు ఎస్‌ఐ లేక పోవడంతో ఉన్న పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక చిన్న స్టేషన్ కావడంతో ర్యాంకర్లు ఎవ్వరూ ఇక్కడికి రావడానికి సుముఖత చూపడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం నంద్యాల మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ దొర్నిపాడుకు బదిలీ అయినట్లు ఉత్తర్వులు సిద్ధంగా ఉన్నప్పటికీ రిలీవ్ చేయక పోవడంతో అక్కడే నిలిచిపోయినట్లు తెలుస్తోంది. కేవలం ఏడాది కాలంలోనే ముగ్గురు ఎస్‌ఐలు బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి మాస్టేషన్‌కు ఎస్‌ఐ కావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం

- శ్రీరామనవమికి ఏర్పాట్లు పూర్తి



సంజీవనగర్ రామాలయంలో కల్యాణోత్సవానికి ఏర్పాట్లు నిర్వహిస్తున్న దృశ్యం



నంద్యాల(వ్యవసాయం): శ్రీరామనవమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించుకునేందుకు పట్టణంలోని పలు రామాలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీతారాముల కల్యాణం తిలకించేందుకు వచ్చే భక్తులకు పెసర పప్పు, బెల్లం పానకం, అన్న వితరణకు ఏర్పాట్లు, చలువ పందిళ్లు, పూలంగి సేవ కార్యక్రమం, పూలతో అలంకరించిన కల్యాణ వేదికలను సిద్ధం చేశారు. సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12గంటలకు అభిజిత్ లగ్నంలో స్వామి వారి దివ్య కల్యాణం సుధీంద్రాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అలాగే సీతాదేవి అమ్మవారికి ఒడిబియ్యం కార్యక్రమం, సాయంత్రం శ్రీనివాసనగర్ పురవీధుల్లో ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం చేపట్టనున్నారు. బైటిపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో రాములవారి కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఈఓ వేణునాథరెడ్డి తెలిపారు. ఎస్‌బీఐ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఎన్‌జీఓ కాలనీ, నందమూరినగర్, రైల్వే స్టేషన్ కోదండ రామాలయం, టెక్కె నాగులకట్ట దేవాలయం, సంగపేట, కోటవీధి రామాలయం, ఉప్పరిపేటలోని భక్తాంజనేయస్వామి దేవాలయాల్లో సదుపాయాలు సిద్ధం చేశారు. మున్సిపల్, విద్యుత్, పోలీస్ శాఖ అధికారులు భక్తులకుఅసౌకర్యం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.



కల్యాణానికి ముస్తాబైన బైటిపేట కోదండ రామాలయం



చిన్నవంగలి గ్రామంలో ముస్తాబైన రామాలయం

చాగలమర్రి: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాల్లోని రామాలయాలు ముస్తాబయ్యాయి. చిన్నవంగలి గ్రామంలో సీతారాముల కళ్యాణం, సాయంత్రం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అదే విధంగా చాగలమర్రిలోని కోదండస్వామి ఆలయంలో, చింతలచెరువు, కొలుములపేట, గోట్లూరు, శెట్టివీడు, గోడిగనూరు, ముత్యాలపాడు, తోడేండ్లపల్లె, మల్లెవేముల, మద్దూరు తదితర గ్రామాలలో సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కొలుములపేట గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ సురేష్



విజేతలకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

చాగలమర్రి: శ్రీరామనవమిని పురస్కరించుకొని మండలంలోని చిన్నవంగలి గ్రామంలో న్యూ క్యాటగిరీ విభాగం వృషభాల బండలాగుడు పోటీలను రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం నిర్వహించారు. పోటీలను స్థానిక ఎస్‌ఐ సురేష్ లాంఛనంగా ప్రారంభించారు. పోటీలలో వివిధ జిల్లాల నుంచి సుమారు 9 జతల వృషభాలు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన బొరెడ్డి కెశవరెడ్డి వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచి రూ.80,000ల నగదు బహుమతిని గెలుచుకున్నాయి. వైఎస్సార్ జిల్లా, రూకవారిపల్లె గ్రామానికి చెందిన విద్య ఓబుల్‌రెడ్డికి ఎద్దులు ద్వితీయ స్థానంలో రూ.60,000, బాపట్ల జిల్లా, ఉప్పమాగులూరు గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి వృషభాలు 3వ స్థానంలో నిలిచి రూ.40,000 నగదును గెలుపొందాయి. నంద్యాల జిల్లా, ఓబులంపల్లె గ్రామానికి చెందిన సతీష్‌కుమార్‌రెడ్డి వృషభాలు నాలుగో స్థానంలో రూ.30,000, నంద్యాల జిల్లా, రొలిమెడం అలగనూరు, వైఎస్సార్ జిల్లా, పోతురెడ్డిపల్లె గ్రామాలకు చెందిన వృషభాలు 5వ స్థానంలో నిలవడంతో ఒక్కొక్కరికి రూ.20,000లు అందజేశారు. బాపట్ల జిల్లా, ఉప్పమాగులూరు గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డికి చెందిన వృషభాలు 6వ స్థానంలో నిలిచి రూ.10,000ల నగదు అందజేశారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఎడ్ల జతకు రూ.3,000 కన్సోలేషన్ బహుమతులను అందజేశారు.

నేడు ట్రాక్టర్ రివర్స్, గాడిదల పందెం

ఆదివారం ఉదయం 8 నుంచి గాడిదలపై 220 కేజీల ఇసుక బస్తా మోసే పందెం, ట్రాక్టర్ రివర్స్‌లో నడుపు పందెం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.100 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 91330 71021, 99485 12840 సెల్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

అవినీతిపై విచారణ జరిపించాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల మున్సిపాటీలో అభివృద్ధి కంటే అవినీతి అధికమైందని, రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఎస్‌డీపీఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కలాం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యా లయంలో అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అయితే వారి అవినీతిపై కౌన్సిలర్లు కూడా నోరు మెదపడం లేదన్నారు. జిల్లా కలెక్టర్, న్యాయ శాఖ మంత్రి స్పందించి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నూరుల్లా, కరీముల్లా, అమీర్, ముల్లా సుల్తాన్ పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారుల అదుపులో నిందితులు

రుద్రవరం: అడవి జంతువుల మాంసం తెచ్చుకున్న విషయంలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు డీఆర్వో ముర్తుజా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రమైన రుద్రవరం పరిధిలో నల్లమల అడవికి సమీపంలో బెస్త కాలనీకి చెందిన కొందరు అడవి జంతువులను వేటాడుతున్నట్లు తెలిసిందన్నారు. బెస్త కాలనీకి చెందిన మల్లేష్,సాం బశివుడు అడవి పంది మాంసం తెచ్చుకుంటుండగా అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు. పంట పొలాల వద్ద కుక్కలు అడవి పందిపై దాడి చేసి చంపడంతో ఆ మాంసం తెచ్చుకున్నట్లు నిందితులు చెబుతున్నారని తెలిపారు.

వానరానికి అంత్యక్రియలు

నందికొట్కూరు: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలోని వేపచెట్టుపై వానరం శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న చౌడేశ్వరి దేవి సేవ సమితి అధ్యక్షులు డాక్టర్ దేశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో హమాలీలు జగదీష్, ప్రతాప్, అరుణ్, మధు, మంజుల సహకారంతో వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు.

పాణ్యంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని వినతి

పాణ్యం: పాణ్యం రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్‌తో పాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు, స్థానికులు గుంతకల్ డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తాకు వినతిపత్రం అందించారు. శనివారం గుంతకల్లు, డోన్-నంద్యాల డబ్లింగ్ పనులను పరిశీలించేందుకు వచ్చిన డీఆర్‌ఎంను వారు కలిశారు. పాణ్యం రైల్వేస్టేషన్ సమీపంలో అనేక పరిశ్రమలు, పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని తెలిపారు. అధిక సంఖ్యలో ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారన్నారు. పాణ్యం రైల్వేస్టేషన్‌లో గుంటూరు-ఔరంగాబాద్, కాచిగూడ-గుంటూరు రైళ్లను ఆపాలని విజ్ఞప్తి చేశారు. వినతులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌ఎం తెలిపారు.

పుణ్యక్షేత్రాలను సందర్శించిన ప్రముఖులు



సంగమేశ్వర ఆలయ చరిత్రను ఆర్డీఓ దంపతులకు వివరిస్తున్న ఆలయ పురోహితుడు



కొలనుభారతి దేవి అమ్మవారికి పూజలు చేస్తున్న కాకనూరు శారదపీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి



గోకవరం భక్తకన్నప్ప గురుకుల ఆవాస విద్యార్థులతో మాట్లాడుతున్న కాకనూరు పీఠాధిపతి

కొత్తపల్లి: మండలంలోని సప్తనది సంగమేశ్వరం, కొలనుభారతి క్షేత్రాలను శనివారం ప్రముఖులు సందర్శించుకున్నారు. సంగమేశ్వరం ఆలయాన్ని కర్నూలు ఆర్డీఓ మల్లికార్జున దంపతులు సందర్శించుకుని వేపధారు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ వారికి ఆలయ విశిష్ఠత, చరిత్రను వివరించారు. కొలనుభారతి క్షేత్రాన్ని కాకనూరు శారద పీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామి దర్శించుకున్నారు. స్వామివారికి ఆలయ పురోహితుడు శ్రీనివాసశర్మ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళ హారతి పూజలు చేసుకున్నారు. అక్కడే ఉన్న సప్తశివాలయాలను సందర్శించారు. ఆలయ విధుల కోసం అర్చకుల మధ్య గత నెల 24న జరిగిన ఘర్షణపై ఆరా తీశారు. ఆలయంలో ఎటువంటి గొడవలు, ఘర్షణలు లేకుండా విధులు చేసుకోవాలని సూచించారు. ఆలయ ప్రతిష్టకు భంగం వాటిల్లకుండా అందరూ కలిసి కట్టుగా విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం గోకవరం భక్తకన్నప్ప గురుకుల ఆవాసాన్ని సందర్శించి విద్యార్థులను కలసి మంచి విద్యను అభ్యసించాలని సూచించారు. గిరిజన విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు.

పెద్దమ్మ చెంత.. చింతలేకుండా




పెద్దమ్మ ఆలయ ముఖద్వారంపై ఉన్న పెద్దమ్మ విగ్రహం వద్ద పావురాలు

దొర్నిపాడు: ఎండావానలకు ఎలాంటి ఇబ్బంది లేదు. పెద్దమ్మ సన్నిధిలో ఉన్నందున ఎవరూ మమ్మల్ని హరించడానికి సాహసించలేరు. అందుకే మేము పెద్దమ్మ చెంత ఎలాంటి చింతలేకుండా ఉన్నామంటున్నాయి పావురాలు. మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన పెద్దమ్మ అమ్మవారి ఆలయ ముఖద్వారం పైన చిన్న గుడిని ఏర్పాటు చేసి పెద్దమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కానీ అక్కడ పావురాలు నివాసం ఏర్పాటు చేసుకోని నివసిస్తున్నాయి. లోపల గూళ్లు కట్టుకొని జతలు జతలుగా ఉంటూ తమ పిల్లలతో సరిదగా గడుపుతున్నాయి. ఆలయం లోపల అపరిశుభ్రం అవుతున్నా పావురాలు ఉంటే మంచిదని భావించి నిర్వాహకులు వాటిని వెళ్లగొట్టకుండా వదిలేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎద్దుల ఆరుపండ్ల విభాగం రాతిదూలం పోటీల్లో విజేతలకు శనివారం నగదు బహుమతులు పంపిణీ చేశారు. రాయవరానికి చెందిన అక్షరారెడ్డి వృషభాలు ఒకటి స్థానంలో నిలిచాయి. రెండో బహుమతి పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి నారాయణరెడ్డి, మూడో బహుమతి కానాలకు చెందిన గుండం చెన్నారెడ్డి, నాల్గో బహుమతి కలసపాడుకు చెందిన బి.వెంకటరెడ్డి, ఐదో బహుమతి టంగుటూరికి చెందిన రాఘవేంద్రారెడ్డి, కానాలకు చెందిన సుబ్రమణ్యం, ఆరో బహుమతి గుండ్లగుంటకు చెందిన మత్రిబోయిన వంశీయాదవ్, నాగయ్యపల్లెకు చెందిన వర్షారెడ్డి, ఏడో బహుమతి దొర్నిపాడుకు చెందిన కృష్ణయ్య యాదవ్, దాసరిపల్లెకు చెందిన దీపరాజునాయుడు నిలిచారు. ఇక ఎనిమిది, తొమ్మిది బహుమతులు కోటకందూరుకు చెందిన గోనలక్ష్మీశరణ్య, కొత్తపల్లికి చెందిన గొల్లప్రసాద్, నర్సిపల్లికి చెందిన ఉప్పరి లక్ష్మీదేవి వృషభాలు సమాన దూరం లాగాయి. 10వ బహుమతి గద్వాలకు చెందిన వంశీకృష్ణ, మాదసుపల్లెకు చెందిన శివప్రసాద్, 11వ బహుమతి చిన్నకానాలకు చెందిన సుంకన్న, 12వ బహుమతి చండ్లపల్లికి చెందిన సోములరంగారెడ్డికి చెందిన వృషభాలు దక్కించుకున్నాయి. వీరికి దాతల సహకారంతో వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.25 వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి, పీవీ నాగార్జునరెడ్డి, లక్ష్మీరెడ్డి, వెంగన్న పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం



ప్రగతి నివేదిక చదువుతున్న ఏఓ చంద్రశేఖర్ రెడ్డి

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. ఉదయం 11 గంటలకు ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన సమావేశం ప్రారంభమయ్యింది. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం నర్సిపల్లె, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ గ్రామ సర్పంచ్‌లు పల్లె గురుప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, ఓబులేస్‌లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిలో ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగులో వీఓఏలు, మధ్యాహ్న భోజన పథకంలో ఏజెన్సీ నిర్వహకులను, చౌక దుకాణ డీలర్లు, పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న స్కావెంజర్లను ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే తొలగిస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. కాగా శనివారం జగజ్జీవన్ రావు జయంతి సెలువు రోజు మండల సర్వసభ్య సమావేశం జరగడంతో పలువురు ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు సైతం తమకు పట్టి పట్టనట్లు సభను మమ అనిపించారు. కార్యక్రమంలో ఎంఈఓ రఘురామిరెడ్డి, పశువైద్యాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమరసతకు నిలువెత్తు రూపం జగ్జీవన్‌రామ్



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు



తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

నంద్యాల(వ్యవసాయం)/(అర్బన్): సమరసతకు నిలువెత్తు రూపం బాబు జగ్జీవన్‌రామ్ అని విశ్వహిందూ పరిషత్ నాయకులు బాబు లింగేశ్వర రావు పేర్కొన్నారు. శనివారం ఆయన జయంతి సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యుగంధర్‌రెడ్డి, ప్రసాదరెడ్డి, సత్యనారాయణ, అరుణ, మల్లేశ్వరి, మోహన్, కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో..

స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కరణ కర్త బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని నంద్యాల జిల్లా పీఆర్‌టీయూ నాయకులు ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు రాంపక్కీర్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర రెడ్డి,రాష్ట్ర నాయకులు రాజశేఖర్‌రెడ్డి, జగదీష్‌బాబు, సుదర్శన్‌రెడ్డి, హుసేన్‌సాహెబ్, నరసింహులు, చెన్నుడు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు నివాళులర్పించారు. మహమ్మద్, ఆనందరావు, శంకర్, శ్రీనివాస్, అబ్రహాం, జయరాజు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని డిప్యూటీ తహసీల్దార్ రామసంజీవరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్నికల డీటీ శేఖర్, ఆర్‌ఐ నాగరాజు, రాజు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ, ఎంఈఓ రఘురామిరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, పీఆర్ ఏఈ వెంకటయ్యతో పాటు పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు.

రుద్రవరం: స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి విద్యార్థినులు నివాళులర్పించారు.



ఉయ్యాలవాడలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, అధికారులు



రుద్రవరం ఆదర్శ పాఠశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థినులు

మహానందీశ్వరుడిని దర్శించుకున్న డీపీఓ

మహానంది: డీపీఓ షేక్ జమీలుల్లా, కుటుంబ సభ్యులు శనివారం మహానందీశ్వర స్వామి, కామేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు.

కూలీలకు గాయాలు

మహానంది: ఆంజనేయపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు సుబ్బమ్మ, వెంకటపుల్లమ్మతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో కుక్క అడ్డు రావడంతో వారు ప్రయాణించే ఆటో బసాపురం రోడ్డు వద్ద బోల్తా పడింది.